

హెచ్ఐవీపై ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి

● డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ

సుభాష్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం వద్ద హెచ్ఐవీ అవగాహన ర్యాలీని కలెక్టర్ పమేలా సత్పతి, డీఎం హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ దేశంలో హెచ్ఐవీ వ్యాధి రోజు రోజుకు తగ్గుముఖం పడుతుందన్నారు. హెచ్ఐవీ కేసులు లేకుండా జీరో కు తీసుకురావాలన్నారు. హెచ్ఐవీ వ్యాధి సోకిన వారు ధైర్యంగా ఉంటు ఎప్పటికప్పుడు మందులు వాడుతూ ఉండాలన్నారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలందించిన ఐసీటీసీ కౌన్సెలర్లకి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధ, డీటీసీఓ డాక్టర్ రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సాజిద, డాక్టర్ రాజగోపాల్‌రావు, డాక్టర్ సన జవేరియా, డెమో రాజగోపాల్, డిపిఓ ఎస్‌హెచ్ ఎం స్వామి, ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి నరేందర్ పాల్గొన్నారు.

నామినేషన్లను రోజువారీగా

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

● కలెక్టర్ పమేలా సత్పతి


తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ ఎన్నికల నామినేషన్ కేంద్రంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ అభ్యర్థి, వార్డు సభ్యుల నామినేషన్ దాఖలును రోజువారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని నుస్తులాపూర్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఆప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి చిన్న అంశాన్ని అభ్యర్థులకు వివరించాలన్నారు. పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పని తీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి


గీతామందిరంలో భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మార్గశిర శుద్ధ ఏకాదశి సందర్భంగా మహిమాన్విత, మోక్షదా ఏకాదశిగా పిలిచే గీతాజయంతిని సోమవారం ఆలయాల్లో, పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉపవాసం పాటిస్తూ విష్ణు ఆరాధనలు జరిపారు. భగవద్గీత పారాయణాలు, గోపూజలు, భగవద్గీత గ్రంథాల వితరణ జరిగాయి. అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతా మందిరంలో గీతా భక్త సమాజం అధ్యక్షుడు బండ సత్తయ్య నేతృత్వంలో గీతా సంపూర్ణ అధ్యాయాల పారాయణం, హవనం జరిగింది. పలు ఆధ్యాత్మిక గ్రంథాల ముద్రణకు సహకరించిన దాతలను సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి పుప్పల రామేశం, చిట్టిమల్ల దామోదర్, గుండ రాధాకిషన్, కాసం సుదర్శనం, అల్లె చిన్నవెంకటయ్య, మర్యాల రవీందర్, అల్లెంకి వెంకటేశం, ఓంకారం, రాజేశం, హనుమాండ్లు, భూపతి, సత్యనారాయణ, చందా గాంధీ, దశరథం, అర్చకుడు చల్లూరి విష్ణుమూర్తిశర్మ పాల్గొన్నారు. వేదభవనంలో సామూహిక గీతాపారాయణం, పాతబజార్ గౌరీశంకర్ ఆలయంలో శివలింగానికి అభిషేకం నిర్వహించారు.

నామినేషన్ల జోరు

- రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 309 నామినేషన్లు
- వార్డులకు 1076 నామినేషన్లు
- నామినేషన్లు వేసేందుకు బారులు తీరిన అభ్యర్థులు


నుస్తులాపూర్‌లో నామినేషన్ కేంద్రం వద్ద అభ్యర్థులు, మద్దతుదారులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)
జిల్లాలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల జోరు కొనసాగుతోంది. మొదటి విడతలో కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాల్లోని 92 సర్పంచ్ స్థానాలకు 463 నామినేషన్లు, 866 వార్డులకు 1939మంది నామినేషన్లు వేశారు. రెండో విడతలో ఎన్నికలు జరిగే తిమ్మాపూర్, మానకొండూర్, గన్నేరువరం, శంకరపట్నం, చిగురుమామిడి మండలాల్లోని 113 గ్రామాల్లోని 113 సర్పంచు పదవులకు మొదటి రోజు 121 నామినేషన్లు 1046 వార్డులకు 209 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో రోజు సోమవారం నామినేషన్ల స్వీకరణ గడువు సాయంత్రం 5 గంటల వరకు ముగిసింది. నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు బారులు తీరడంతో ఐదు గంటలలోపు వచ్చిన వారికి టోకెన్లు ఇచ్చి నామినేషన్లను స్వీకరించారు.

● నేడు మొదటి విడత నామినేషన్లఉపసంహరణ

ఈనెల 11న ఎన్నికలు మొదటి విడత జరిగే ఐదు మండలాల్లోని 92 సర్పంచు, 866 వార్డు సభ్యుల పదవుల నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనున్నది. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన వెంటనే చెల్లుబాటు అయిన నామినేషన్ల పేర్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటిస్తారు. ఆ తర్వాత తుది జాబితాలోని అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు.

- తిమ్మాపూర్ మండలంలోని 23 సర్పంచ్ స్థానాలకు 65 మంది, వార్డు పదవులకు 271 మంది నామినేషన్లను వేశారు. రెండురోజుల్లో మొత్తం సర్పంచు పదవులకు 95 నామినేషన్లు, 212 వార్డులకు 316 నామినేషన్లు దాఖలయ్యాయి.

మానకొండూర్ మండలంలోని 29 సర్పంచ్ స్థానాలకు రెండో రోజు 61 నామినేషన్లు రాగా వార్డులకు 292 నామినేషన్లు వచ్చాయి. రెండు రోజుల్లో కలిపి సర్పంచ్ స్థానాలకు 91 నామి నేషన్లు, వార్డులకు 357 నామినేషన్లు దాఖలయ్యాయి.

- గన్నేరువరం మండలంలోని 17 సర్పంచ్ స్థానాలకు రెండు రోజుల్లో 59 మంది నామినేషన్లు వేశారు. 140 వార్డులకు రెండు రోజుల్లో కలిపి 113 నామినేషన్లు వచ్చాయి.

- శంకరపట్నం మండలంలోని 27 సర్పంచు స్థానాలకు మొదటిరోజు 35, రెండో రోజు 81, మొత్తం 116 నామినేషన్లు వచ్చాయి. 240 వార్డు పదవులకు మొదటి రోజు 50, రెండో రోజు మొత్తం 233 నామినేషన్లు, మొత్తం 283 దాఖలయ్యాయి.

- చిగురుమామిడి మండలంలోని 17 సర్పంచ్ స్థానాలకు రెండు రోజుల్లో 69, 174 వార్డులకు 216 నామినేషన్లు దాఖలయ్యాయి. మంగళవారం సర్పంచ్ స్థానాలకు 53, వార్డు సభ్యులకు 184 నామినేషన్లు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా రెండో విడత ఎన్నికలు జరిగే సర్పంచు స్థానాలకు 309 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డు సభ్యుల పద వులకు 1076 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. చివరిరోజు నామినేషన్ల సంఖ్య ఎక్కువగానే ఉంటుందని భావిస్తున్నారు. బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లను పరిశీలిస్తారు. గురువారం ఏమైనా అభ్యంతరాలుంటే సాయంత్రం 5 గంటల వరకు అప్పీలు చేసుకునే అవకాశం ఉంటుంది. శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది.

● తాయిలాలు... బుజ్జగింపులు

మొదటి విడత జరిగే సర్పంచ్, వార్డు సభ్యుల

(మిగతా 8వ పేజీలో)


చెక్‌పోస్టును పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్

తిమ్మాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై టోల్‌గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు చంద్రశేఖర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు, ప్రత్యేక బలగాలతో ఆయన మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, ఎల్ఎండీ ఎస్ఐ శ్రీకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


తిమ్మాపూర్ మండలం రేణికుంట చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీని పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్

కాలుష్యంతో సతమతం

● నేడు జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం


డంపింగ్ యార్డులో ఎగిసిపడుతున్న మంటలు (ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాతావరణం వివిధ కారణాలతో కలుషితమవుతోంది. అడవులు తగ్గిపోవడంతో గ్లోబల్‌వార్మింగ్ పెరిగిపోతున్నది. సహజ వనరులను అవసరానికి మించి వినియోగిస్తుండడంతో గాలి కలుషితమై భూతాపం పెరుగుతోంది. పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ విచక్షణతో వ్యవహరించినప్పుడే జీవ వైవిధ్యం సురక్షితంగా ఉంటుంది. అప్పుడే సమస్త జీవులు మనుగడను సాగిస్తాయి.

● నేపథ్యం

1984 డిసెంబరు 2న రాత్రి భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ పరిశ్రమ నుంచి మిథైల్ ఐసోసైనేట్(ఎంఐసీ) వాయువు లీక్ అయి వేలాది మంది చనిపోయారు. లక్షలాది మంది శాశ్వత శారీరక, మానసిక సమస్యల బారినపడారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో ప్రతి సంవత్సరం డిసెంబరు 2న జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పర్యావరణ భద్రత, పారిశ్రామిక నిర్వహణపై అవగాహన కల్పిస్తారు.

● కరీంనగర్ డంప్‌యార్డుతో ఇబ్బందులు

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన డంప్‌యార్డు నిరంతరం రగులుతూనే ఉంటుంది. ఈ ప్రాంతం నుంచి విపరీతమైన పొగ వెలువడి పరిసర కాలనీలకు విస్తరిస్తోంది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో పరిస్థితి తీవ్రంగా ఉంది. చుట్టుపక్కల ప్రాంతాలు దట్టమైన పొగతో నిండిపోయి స్థానిక ప్రజలు శ్వాస సమస్యల బారినపడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ డంప్ యార్డు శాశ్వత పరిష్కార జేఏసీ నిరసన, ధర్నా కార్యక్రమాలను చేపట్టి, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చింది. ఇంత వరకు డంపుయార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు.

సైన్స్, టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు

భగత్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సైన్స్, టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతాయని జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య అన్నారు. సోమవారం కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో బాల వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థులు శాస్త్ర వేత్తలుగా ఎదగాలన్నారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు ఆలోచన చేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు బాల వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతంగా నిర్వహించామన్నారు. 176 పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొన్నార న్నారు. 807 ఎగ్జిబిట్స్ ప్రదర్శించగా 126 ఇన్‌స్పైర్ అవార్డు వచ్చాయన్నారు. 13 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయని తెలిపారు. ప్రతి థీమ్ నుంచి ప్రథమ స్థానం సాధించిన ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి పంపిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఎస్ భగవంతయ్య, సెక్టోరియల్ అధికారులు కర్ర అశోక్‌రెడ్డి, ఆంజనేయులు, మిల్కూరి శ్రీనివాస్, కృపారాణి, ఎస్టీఎఫ్ సెక్రెటరీ వేణు గోపాల్, కొత్తపల్లి ఎంఈవో తుమ్మ ఆనందం, ఏనుటు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


విజేతలతో డీఈవో శ్రీరాంమొండయ్య, అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి

ఐదు రోజుల్లో పైపులైన్లకు మరమ్మతులు చేయాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పైపులైన్లకు మరమ్మతులు చేసి నీరు వృథా పోకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన కమాన్ చౌరస్తా నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు ఆర్అండ్‌బీశాఖ గతంలో వేసిన పైపులన్లను పరిశీలించారు. ఈ పైపులు చాలా చోట్ల లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వెంటనే వాటికి మరమ్మతులు చేయాలని సూచించారు. సమయానికి పనులు పూర్తికాక పోతే ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని హెచ్చరించారు.

గుజరాత్‌లో రైలు ఢీకొని కరీంనగర్ విద్యార్థి దుర్మరణం 6

ఆ రెండు గ్రామాల్లో ఎన్నికలు లేవు 7

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం

సుభాష్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ పరీక్షలు చే యడం చట్టరీత్యా నేరమని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జిల్లా అడ్వయిజరీ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ ఎంపిక నిషేధ చట్టాన్ని అతిక్రమించిన ఏడు స్కానింగ్ సెంటర్లకి షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. గర్భంలోని పిండం ఆడ, మగ శిశువు అని గర్భిణికి గాని వారి కుటుంబ సభ్యులకు గాని తెలియజేయడం నేరమన్నారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ చేస్తే ఆ సమాచారాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలోని టోల్ ఫ్రీ నవంబర్ 9849902501కు తెలియజేయాలన్నారు. జిల్లాలో అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లను స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

ఈసారైనా నజరానాలు అందేనా?

- ఏకగ్రీవ పంచాయతీలకు మొండి చేయి చూపిన గత ప్రభుత్వం
- ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి రాని ప్రోత్సాహక నిధులు



హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. ఈసారి కూడా ఏకగ్రీవమయ్యే పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నజరానా ప్రకటించింది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యే పంచాయతీలకు ప్రోత్సాహకంగా 10 లక్షల రూపాయలు ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈసారి ఈ ప్రకటనకు స్పందన ఎలా ఉంటుందన్నదే చర్చనీయాంశంగా మారింది. ఇందుకు కారణం గత ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు ఏకగ్రీవాలు చేసుకుంటే పాలకవర్గాల పరిమితి ముగిసే నాటికి ఎలాంటి నిధులు రాలేదు. ఈ ప్రోత్సాహకాలు అంద నందువల్ల ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేక పోయాయమని మాజీలు అభిప్రాయపడుతున్నారు.

● మొర ఆలకించలేదు...

గత పంచాయతీ ఎన్నికలు 2019 జనవరిలో జరిగాయి. పాలకవర్గాల గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు జరగలేదు. పంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలన కిందకు వెళ్లాయి. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అనుకున్న స్థాయిలో గ్రాంట్లు విడుదల కాకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. కొన్ని పంచాయతీల్లో సర్పంచ్‌లు అప్పులు తెచ్చి పనులు చేశారు. పాలకవర్గాలు స్థానిక నేతలు, ఎమ్మెల్యే ద్వారా తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. కనీసం ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు ప్రోత్సాహకాలన్నా ఇప్పించాలని కోరినా ఫలితం దక్కలేదు.

● ప్రశాంతంగా ఎన్నికలకు...

పంచాయతీ ఎన్నికలు ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా, వివాదాలకతీతంగా ప్రశాంతంగా జరిగేందుకు, ప్రజలు ఐక్యంగా ఉండి ప్రశాంత వాతావరణంలో పల్లెలను తీర్చిదిద్దుకోవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవాలను ప్రోత్సాహకంగా ఈ నజరానాను ప్రకటించింది. నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఒక్కో గ్రామ పంచాయతీకి 10 లక్షల రూపాయల ప్రోత్సాహక నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. 20 లక్షల నిధులొస్తాయని ప్రజలు భావించారు. దీంతో వారంతా ఏకమై పార్టీలను పక్కనపెట్టి పంచాయతీలను ఏకగ్రీవం చేశారు. హుజూరాబాద్ మండలంలో నాలుగు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. పాలకవర్గాల పదవీకాలం ముగిసినా చిల్లిగవ్వ ఇవ్వలేదు. ఎమ్మెల్యేలు, ఎంపీలు సైతం తాము ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఏకగ్రీవంగా గెలిచిన వారు వాపోయారు.

● వివరాలు తీసుకున్నా...

గత ప్రభుత్వం ఏకగ్రీవ ప్రోత్సాహకాలు ఇస్తానని జిల్లా పంచాయతీ అధికారుల నుంచి వివరాలను తీసుకుంది. నిధులు మాత్రం విడుదల కాలేదు. ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలు ప్రోత్సాహక నిధులు వస్తాయనే ఆశతో పాలవర్గాలు అత్యవసర పనులకు తీర్మానం చేసుకొని పనులను పూర్తి చేసి ప్రభుత్వం ఇచ్చే నిధుల కోసం నిరీక్షించారు. నిధులు రాకపోవడంతో గ్రామస్థులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వం కూడా ఏకగ్రీవ పంచాయతీలకు 10 లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటించింది. ఈసారైనా నిధులు వస్తాయా అనే సందేహాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

గుజరాత్‌లో రైలు ఢీకొని..
కరీంనగర్ విద్యార్థి దుర్మరణం



సాయివర్ధన్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో రైలు ఢీకొన్న ఘటనలో కరీంనగర్ బొమ్మకల్ గ్రామానికి చెందిన విద్యార్థి మృతి చెందాడు. రాజ్‌కోట్‌లోని మార్వాడి యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గన్ను సాయివర్ధన్‌రెడ్డి(20) ఆదివారం దుర్మరణం చెందాడని కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి తెలిపారు. మృతుడి తండ్రి గన్ను రాజిరెడ్డి బొమ్మకల్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తూ, వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఆయనకు కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు సాయివర్ధన్‌రెడ్డి రాజ్‌కోట్ సిటీలో మార్వాడి యూనివర్సిటీలో హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో కరీంనగర్‌కు చెందిన మరికొందరు విద్యార్థులతో కలిసి సాయివర్ధన్‌రెడ్డి షాపింగ్ కోసం హాస్టల్ నుంచి ఔటింగ్‌కు వెళ్లాడు. ఆ సమయంలో రైలు క్రాసింగ్ వద్ద ప్రమాదం జరిగింది. సాయివర్ధన్‌రెడ్డి మరణవార్త తెలియగానే తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఉన్నతచదువుల కోసం గుజరాత్ రాష్ట్రానికి వెళ్లిన సాయివర్ధన్‌రెడ్డి పట్టాతో ఇంటికి వస్తాడనుకుంటే విగతజీవిగా మారాడని కుటుంబసభ్యులు రోదిస్తున్నారు. సాయివర్ధన్‌రెడ్డి మృతదేహాన్ని కరీంనగర్‌కు తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం మృతదేహం బొమ్మకల్‌కు చేరుకోనున్నట్లు, బొమ్మకల్ గ్రామంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. సాయివర్ధన్‌రెడ్డి మృతికి పలువురు సంతాపం తెలిపారు.

విద్యుత్ వైర్లు అపహరణ

ఇల్లంతకుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్జీపూర్ గ్రామంలో వ్యవసాయ బావుల నుంచి విద్యుత్ వైర్ల అపహరణ జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గుండ శ్రీనివాస్ అనే రైతుకు చెందిన వ్యవసాయ బావివద్ద స్టార్టర్ నుండి బోర్‌మోటారుకు వెళ్లే 40మీటర్ల రాగివైరు సోమవారం అపహరణకు గురైంది. ఇదే గ్రామానికి చెందిన గుండ వెంకటేష్‌కు చెందిన 30మీటర్ల విద్యుత్ వైరు అపహరించుకొని పోయారు. కొద్దిరోజుల క్రితం ఎల్లమ్మగుడి సమీపంలోని బోరు వద్ద నుంచి 15మీటర్ల విద్యుత్ వైర్‌ను కత్తిరించుకొని పోయారు. గ్రామంలో వరుసగా బావుల వద్ద దొంగతనాలు జరుగుతున్నాయని, పోలీసులు స్పందించి దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుచున్నారు.

- మాడ్వీ హిడ్మా పురుడుపోసిన పీఎల్‌జీఏ
- సంచలనాల కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌కు 25 ఏళ్లు
- నేటి నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలు



కొయ్యూరు అమరత్వం.. పీఎల్‌జీఏ ఆవిర్భావం

మంథని, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విప్లవోద్యమ చరిత్రలో కొయ్యూరు ఎన్‌కౌంటర్ సంచలనం రేపింది. మావోయిస్టు అగ్ర నేతలు నల్లా ఆదిరెడ్డి, శీలం నరేష్, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు మంథని నియోజకవర్గంలోని (ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా) మల్హర్ మండలం కొయ్యూరు అటవీ ప్రాంతంలో 1999 డిసెంబర్ 2న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారు. వీరి మరణంతో ఆవిర్భవించిన మావోయిస్టు పార్టీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఏఎల్‌జీఏ)కు డిసెంబర్ 2తో 24 వసంతాలు నిండాయి. పీఎల్‌జీఏ పేరిట సైనిక బలగాన్ని ఏర్పాటు చేసుకుంది. మావోయిస్టు అగ్ర నేతలు దేశంలోని విప్లవ సంస్థలను ఒక్క తాటి మీదకు తీసుకురావడంలో వీరు చేసిన కృషి దేశ విప్లవోద్యమ చరిత్రలో చిరస్మరణీయమైంది.. యేటా డిసెంబరు 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలు కొనసాగుతున్నాయి.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన నల్లా ఆదిరెడ్డి, జగిత్యాలకు చెందిన శీలం నరేష్, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కడివెండి గ్రామానికి చెందిన ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు తాడిత, పీడిత ప్రజల విముక్తి కోసం ఉన్నత చదువులను, కన్నవారిని వదిలి ఆయుధాలు చేతపట్టి అజ్ఞాతంలో ఉంటూ సాయుధ పోరాటం చేశారు. సామాన్య కార్యకర్తలుగా పీపుల్స్‌వార్ లో చేరిన ఈ ముగ్గురు కేంద్ర కమిటీ నాయ కుల స్థాయికి ఎదిగారు.

మావోయిస్టు పార్టీకి రక్షణ కవచంగా.. శత్రువులపై మెరుపు దాడులు చేయటానికి.. క్యాడర్‌లో పోరాట స్ఫూర్తిని నింపడానికి.. సాయుధ బలంగా.. సంచనాల అగ్రనేత మాడ్వీ హిడ్మా పురుడు పోసిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) ఆవిర్భావానికి మంగళవారంతో రెండున్నర దశాబ్దాలు నిండాయి. ఇటీవల సంచలనం రేపిన మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత మాడ్వీ హిడ్మా మృతి చెందాడు. ఈ క్రమంలో పీఎల్‌జీఏ 25వ వారోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి.

● ధీరత్వానికి చిహ్నంగా బేగంపేటలో స్థూపం..


బేగంపేటలో కొయ్యూరు అమరవీరుల స్మారక స్థూపం(ఫైల్)

వారి వీరత్వానికి, త్యాగాలకు చిహ్నంగా నాటి పీపుల్స్‌వార్ (మావోయిస్టు) పార్టీ ప్రథమ వర్ధంతి సందర్భంగా పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్ జీఏ) పేరిట సైనిక బలగాన్ని ఏర్పాటు చేసుకుంది. దీంతో యేటా వారి స్మారకంగా డిసెంబర్ 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవా లను నిర్వహిస్తూ వ స్తోంది. వీరి స్మారకంగా మంథని డివిజన్‌లోని రామగిరి మండలం బేగంపేటలో మావో యిస్టు పార్టీ నిర్మించిన 53 అడుగుల ఎత్తైనా స్థూపాన్ని 2005 నవంబర్ 13న కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఆవిష్కరించారు.

● ఎంసీసీఐ-పీపుల్స్‌వార్ విలీనంతో పీపల్‌జీఏగా మార్పు..

దేశంలోని రెండు అతి పెద్ద మావోయిస్టు పార్టీలైన సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్, ఎంసీసీఐలు 2004 సెప్టెంబర్ 21న విలీనమై దేశవ్యాప్తంగా విప్లవోద్యమాన్ని విస్తరించటానికి అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ-మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. దీంతో పీపుల్స్ గెరిల్లా ఆర్మీని కొత్త పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ)గా మార్చారు. అప్పటి నుంచి పీఎల్‌జీఏ వారోత్సవాలుగా పిలుస్తున్నారు. పీఎల్‌జీఏ పూర్తిగా మావోయిస్టు కేంద్ర మిలటరీ కమీషన్ ఆధీనంలో పని చేస్తుంది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడు రోజుల కమ్యూనిటీ సర్వీస్ శిక్ష

కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో దుబంబ మధు(47) అనే వ్యక్తికి కమ్యూనిటీ సర్వీస్ శిక్ష విధిస్తూ కరీంనగర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ లక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షలో భాగంగా ఏడు రోజులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించే విధులు నిర్వహించాలని పేర్కొన్నట్లు తెలిపారు. అదేవిధంగా పలువురికి జరిమానాలు విధించినట్లు చెప్పారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

కోల్‌సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడుతూ రెండోసారి పట్టుబడిన ఓ వ్యక్తికి గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దురువ సోమవారం మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మరో ఏడుగురుకి రెండు వేల రూపాయల చొప్పున జరిమానా విధించారు.

ఈత చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మంథనిరూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు ఈత చెట్టు పైనుంచి కింద పడటంతో తాళ్లపల్లి సంతోష్‌గౌడ్ అనే గీతకార్మికుడికి సోమవారం గాయాలయ్యాయి. చెట్టుపై కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడటంతో సంతోష్ గౌడ్‌కు గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబసభ్యులు కరీంనగర్‌కు తరలించారు.

డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దు


వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి శివారులో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ డంపింగ్ యార్డు ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించిందన్నారు. కొత్తపల్లి సమీపంలో యూనిట్ నెలకొల్పడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రైతులు ఆరోగ్యపరంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడే కాలుష్యంతో శ్వాసకోశ, చర్మ వ్యాధులు, అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. డంపింగ్‌యార్డు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయా లని, నివాస ప్రాంతాలకు దూరంగా తరలించాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు ఖలీద్, రత్నం, రవీందర్‌బాబు, తిరుపతి, ప్రభాకర్, స్వామి, ప్రకాష్, వెంకటరమణ, రమేష్, గోపాల్ రావు, ముత్యంరాజు, శ్రీనివాస్‌చందు, రవీందర్, సంపత్, దశరథం, లడ్డు, అజ్జు, రాజేశ్వర్ రావు, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

రాజన్న ఆలయ విస్తరణ పనులకు అంతరాయం

- అడుగులో భారీ రాళ్లు రావడంతో పనిచేయని డ్రిల్లింగ్ మిషన్స్


తిరిగి వెళ్తున్న భారీ డ్రిల్లింగ్ మిషన్

వేములవాడ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన విస్తర ణ పనులకు అంతరాయం ఏర్పడింది. ఆలయం లో రూ. 76 కోట్లతో నిర్మల్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ అభివృద్ధి పనులను చేపట్టారు. నెల రోజులుగా కొనసాగుతున్న పనుల్లో భాగంగా ఇటీవల వైజాగ్ నుంచి భారీ (బాహుబలి) డ్రిల్లింగ్ మిషన్, క్రేన్‌లను తెప్పించారు. ఈ మిషన్‌ల ద్వారా 33 అడుగుల లోతుతో పిల్లర్ గుంత లు తీస్తున్నారు. ఈ క్రమంలో మిషన్‌లకు భారీ రాళ్ల అడ్డుతగిలి డ్రిల్లింగ్ లోపలికి పోకుండా పక్కకు వెళ్తుండటంతో డ్రిల్లింగ్ పనులు చేయడం ఇబ్బందిగా మారింది. అడుగులో బండరాళ్లు రావడంతో విస్తరణ పనులకు ఆటంకం కలిగింది. ఆలయ డిజైనర్ ఆదేశాల మేరకు పనులు తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో డ్రిల్లింగ్ మిషన్, క్రేన్‌లు తిప్పిపంపారు. ప్రత్యామ్నాయంగా మట్టి తవ్వి పనులు చేపట్టడానికి రూపకల్పన చేస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ ఈఈ నర్సింహాచారి తెలిపారు.

హైదరాబాద్‌కు క్షతగాత్రుడి తరలింపు

- మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగునూర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనలో చామనపల్లికి చెందిన తొంటి రమేష్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సోమవారం ఉదయం హైదరాబాద్‌కు తరలించారు. మరో మహిళ హైమావతి చికిత్సపొందుతున్నది. ప్రమాదంలో మరణించిన రఘురాం, దేవేందర్‌రెడ్డి మృతదేహాలకు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి బాధిత కుటుంబాలకు అప్పగించారు.

● మృతుల కుటుంబాలను ఆసుపత్రి వద్ద కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

దాడి కేసులో నలుగురిపై కేసు

గంభీరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌కాలనీకి చెందిన గోల్లేని వెంకటనర్సు, గోల్లేని దేవేందర్, గోల్లేని నరసవ్వ, కవితలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గతంలో భూ వివాదంపై నలుగురు గోల్లేని నర్సయ్యపై కర్రలతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. సంఘటన సమయంలో అడ్డువెళ్లిన నర్సయ్య భార్య లక్ష్మి, కొడుకులు గోల్లేని కరుణాకర్, చందులపై కూడా కర్రలతో దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారని సీఐ తెలిపారు. నర్సయ్య కొడుకు కరుణాకర్ ఫిర్యాదు మేరకు వెంకటనర్సు, దేవేందర్, నర్సవ్వ, కవితలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కుక్కదాడిలో ఒకరికి గాయాలు

- మరో ఘటనలో లేగ దూడ మృతి

కోనరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కోలకాని ముత్తయ్య కుక్క దాడిలో గాయపడ్డాడు. మండల కేంద్రానికి చెందిన ముత్తయ్య వ్యవసాయ పనుల నిమిత్తం వెళుతుండగా వీధి కుక్క దాడి చేయగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. కాగా మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన అనుముల మహేందర్‌కు చెందిన లేగ దూడపై వీధి కుక్కలు దాడి చేయగా మృతి చెందింది. సుమారు రూ. 20 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరుతున్నాడు.

సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయండి

-ఎస్పీ అశోక్ కుమార్ - చోరీకి గురైన 136 సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత



బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. జిల్లాలో పోగొట్టుకున్న, చోరీకి గురైన రూ.28లక్షల విలువ చేసే 136 సెల్‌ఫోన్లను సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధితులకు ఎస్పీ అశోక్ కుమార్ అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చన్నారు. మొబైల్‌ఫోన్ వివరాలను సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే త్వరగా పట్టుకోవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.3.5 కోట్ల విలువ గల 1,548 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించా మన్నారు. ఎవరికైనా సెల్‌ఫోన్ దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని, ఆ నబరుకు ఫోను చేసి అప్పగించాలని సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిన ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ రఫీక్ ఖాన్, సిఈఐఆర్ టీం ఆర్ఎస్ఐ కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుల్ అజార్‌లను ఎస్పీ అభినందించారు.

కరీంనగర్ క్రైం: కరీంనగర్ బోయవాడకు చెందిన పి.వెంకటేష్ నవంబరు 18న గుంటూరుపల్లిలో ఫోన్‌ను పోగొటుకొని కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ నల్గొండలో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. సోమవారం రూరల్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను వెంకటేష్‌కు అప్పగించారు. ఫోన్ రికవరీలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో ఫణి శ్రీనివాస్(48) కుటుంబ కలహాలతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ లక్ష్మణ్ సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని శ్రీనివాస్ వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంత కాలంగా కుటుంబంలో గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో శ్రీనివాస్ భార్య శోభ రెండేళ్ల క్రితం పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోవడంతో ఆయన ఒంటరిగా ఉంటున్నాడు. దాంతో మనస్థాపానికి గురై గత నెల 30న ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య శోభ, కూతుళ్లు మేఘన, సహస్ర, కొడుకు అక్షయ్ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

చొప్పదండి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర మహాసభల పోస్టర్లను సోమవారం చొప్పదండిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర 5వ మహాసభలు ఈ నెల 7, 8, 9న మెదక్‌లో జరగనున్నట్లు చెప్పారు. ఉద్యోగ, కార్మిక వర్గాలు తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు కొమ్మనవేని అశోక్, నాయకులు గుంట అంజయ్య, మారం సత్తయ్య, పిట్టల కొమురెల్లి, మారం గంగమల్లు, మంద మల్లేశం, అరిగే కరయ్య, రేగుల తిరుపతి, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి


బోల్తా పడిన ట్రాక్టర్

భీమారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రం నుంచి కాచారం రోడ్డులో సోమవారం ట్రాక్టర్ బోల్తా పడి వెంకటేష్ (41) అనే వ్యక్తి మృతిచెందాడు. భీమారం మండల కేంద్రానికి చెందిన కల్లెడ వినయ్‌కు చెందిన ట్రాక్టర్‌పై ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వెంకటేష్ కాచారం నుంచి భీమారం వైపునకు వస్తుండగా అదుపు తప్పి ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. గాయడిన వ్యక్తిని స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనం తనిఖీ


ఆది శ్రీనివాస్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

రుద్రంగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని రెండు జిల్లాల సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ఆది శ్రీనివాస్ వాహనాన్ని అధికారులు ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


ఎమ్మెల్యే కవ్వంపల్లికి స్వామి చిత్రపటం అందజేస్తున్న నిర్వాహకులు

ఇల్లంతకుంట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో జరుగుతున్న మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. రెండు రోజుల నుంచి జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నాయకులు మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎలుక రామస్వామి, మామిడి రాజు, సుదగోని తిరుపతిగౌడ్, గుర్రం ఆదిరెడ్డి, సింగిరెడ్డి వెంకటరాంరెడ్డి, కమలాకర్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

శీతాకాలంలో సిరులు


కొనాయపల్లిలో క్యాలీఫ్లవర్ తోట

● క్యాలీఫ్లవర్ సాగుపై రైతుల దృష్టి

వేములవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీతాకాలంలో సిరులు కురుపించే క్యాలీఫ్లవర్ పంటపై రైతులు దృష్టిసారిస్తున్నారు. దిగుబడి సైతం అధికంగా రావడంతో రైతులు ఎక్కువ మొత్తంలో సాగు చేస్తున్నారు. వేములవాడ పట్టణ పరిధిలోని కొనాయపల్లి, నాంపల్లి, కురుమపల్లి, శాలరామన్నపల్లి గ్రామాల్లోని రైతులు క్యాలీఫ్లవర్ సాగుపై మక్కువ చూపుతున్నారు. క్యాలీఫ్లవర్ సాగుకు వేడి, తేమతో కూడిన వాతావరణం 20 నుంచి 27 డిగ్రీలు సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటే అనుకూలంగా ఉంటుంది. విత్తనాలను నర్సరీలో మే, జూన్ నెలలో నాటగా మొలకెత్తిన కొద్ది రోజులకు రైతులు నర్సరీల నుంచి కొనుగోలు చేసి దమ్ముచేసుకున్న భూమిలో అర అంగుళం లోతులో నాటుకోవాల్సి ఉంటుంది. మొక్క మొక్కకు మధ్య 18 అంగుళాల దూరం ఉండేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. అవసరాన్ని బట్టి ఎరువులు, నీరు అందిస్తే అధిక దిగుబడులు ఆశించవచ్చు.


క్యాలీఫ్లవర్ సాగు చేస్తున్న రైతు శంకర్

వేములవాడ పట్టణంలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన రైతు గోనె శంకర్ తనకు ఉన్న 20 గుంటల భూమిలో కొంత మేర పచ్చి మిర్చి, చిక్కుడు, బెండ సాగు చేయగా 10 గుంటల్లో క్యాలీఫ్లవర్ సాగు చేశాడు. క్యాలీఫ్లవర్ మొక్కలు నాటిన రోజు నుంచి 90 రోజులకు పంట కోతకు వచ్చింది. మార్కెట్‌లో కూడా మంచి ధర పలుకుతోందని చెపుతున్నాడు. క్యాలీఫ్లవర్ సాగులో అంతరపంటగా ఉల్లి పంటను సాగు చేసుకునే అవకాశం ఉన్నది.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



తలబడుతున్న కరీంనగర్-నల్లగొండ బాలుర జట్లు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం మినీ స్టేడియంలో పది ఉమ్మడి జిల్లాల 8వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల వాలీబాల్ పోటీలు సోమవారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. లీగ్ పద్ధతిలో బాలబాలికలకు వేరు వేరుగా నాలుగు కోర్టుల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు తమ అభిమతాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

● సెమీ ఫైనల్‌కు చేరిన బాలుర జట్లు వరంగల్, నిజామా బాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జట్లు, బాలికల్లో వరంగల్, నిజాబాద్, మహ బూబ్‌నగర్, నల్గొండ జట్లు సెమీ ఫైనల్‌కు చేరాయి. మంగళ వారం ఉదయం సెమీ ఫైనల్స్, సాయంత్రం ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

జాతీయ జట్టులో స్థానం సాధిస్తా..

- ముత్యాల మనోజ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు క్రీడాకారుడు



జాతీయ జూనియర్స్ వాలీబాల్ జట్టులో స్థానం సాధిస్తాను. 2023- 24లో సబ్ జూనియర్స్ అండర్-14 వెస్ట్ బెంగాల్, 2024-25 ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగంలో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన వాలీబాల్ జాతీయ స్థాయిలో పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించాను.

జూనియర్స్‌లో బంగారు పతకం తెస్తాం..

- చల్ల సాహితీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు క్రీడాకారిణి



జాతీయస్థాయి జూనియర్స్ పోటీల్లో తనకు అవకాశం వస్తే ఈసారి బంగారు పతకం సాధిస్తాం. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నాను. సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాం.

అకాడమీ శిక్షణతో ఆట తీరు మారింది..

- విస్లావత్ నరేందర్, నిజామాబాద్ జిల్లా జట్టు క్రీడాకారుడు



వాలీబాల్ అకాడమీలో చేరాక నా ఆట తీరు మారింది. ఉదయం సాయంత్రం శిక్షణతో ఆటలో నైపుణ్యం సాధిస్తున్నాను. 2023, 2024లో సబ్ జూనియర్స్ అండర్-16, అండర్-17 విభాగాల్లో జరిగిన వాలీబాల్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ పోటీలలో ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక య్యాను. రాజస్థాన్‌లో జరగనున్న జూనియర్స్ జాతీయ పోటీలకు ఎంపిక అవుతానని నమ్మకం ఉంది.

ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు గుర్తింపు..

- గిన్నె లక్ష్మణ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రతిభ ఉన్న క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి జట్టులో స్థానం సాధిస్తున్నారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను 49వ జాతీయ స్థాయి బాలబాలికల జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్ర జట్టుకు ఎంపిక జరుగుతుంది. డిసెంబరు 16 నుంచి 20 వరకు రాజస్థాన్‌లో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి.





బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాల్య వివాహాల నియంత్రణపై నజర్

- ప్రత్యేక బృందాలతో అవగాహన సదస్సులు
- డిసెంబరు 6వరకు కార్యక్రమాలు
- ప్రతి గ్రామంలో 14మందితో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల ఏర్పాటు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కొన్ని ప్రాంతాల్లో పేదరికం, నిరక్షరాస్యత, అభద్రతాభావం వంటి కారణాలతో బాల్య వివాహాలు చేస్తున్నారు. బాల్య వివాహాలతో బాలికల చదువు మధ్యలోనే ఆగిపోయి, వారి భవిష్యత్ వంటింటికే పరిమితం అయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. మరోవైపు చిన్న వయస్సులోనే గర్భవతి కావడంతో సదరు బాలిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో జగిత్యాల జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా మార్చే దిశగా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. నవంబరు 10న ప్రారంభమైన అవగాహన సదస్సులు డిసెంబరు 6వరకు కొనసాగనున్నాయి. సదస్సుల్లో బాల్య వివాహ నిరోధక చట్టం-2006, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పలితాలను వివరిస్తూ విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్, ప్రాజెక్టు స్థాయిలో సీడీపీవో (ఐసీడీఎస్), మండల స్థాయిలో తహసీల్దార్, సెక్టార్ స్థాయిలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ పర్యవేక్షిస్తారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీవోఏలతో పాటు మరో 12మందిని కమిటీలో సభ్యులుగా చేర్చి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేశారు. బాల్యవివాహాల రహిత జిల్లాగా జగిత్యాలను మార్చేలా 20మండలాల్లో 19 బృందాలు ఏర్పాటు చేసి ఆయా గ్రామ పంచాయతీల్లో, జిల్లా పరిషత్ పాఠశాలలు, కేజీబీవి, మోడల్ స్కూల్స్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

● బాల్య వివాహాల నిరోధక అధికారి విధులు

- జిల్లాలో బాల్యవివాహాలపై ఏదైనా ముందస్తు సమాచారం ఉంటే ఇరుపక్షాల తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి బాల్యవివాహం చట్టం గురించి వివరించారు. బాల్య వివాహం జరగకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలి.

-పిల్లలతో మాట్లాడి బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించాలి.

-బాల్యవివాహం చేసుకోకుండా ఉండడం అతడి/ఆమె హక్కు అని తెలపాలి.

అవగాహనతోనే బాల్యవివాహాలకు అడ్డుకట్ట

-బోనగిరి నరేష్, పీడీ ఐసీడీఎస్, జగిత్యాల జిల్లా



జగిత్యాల జిల్లాలో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. బాల్య వివాహాలను నియంత్రించడానికి జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సుల నిర్వహణకు ఆదేశించింది. ఇప్పటి వరకు 15మండలాల్లో సదస్సులు పూర్తయ్యాయి. డిసెంబర్ 6 వరకు మిగతా మండలాలను పూర్తిచేస్తాం. మీ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరిపించే ప్రయత్నం చేస్తే చైల్డ్ హెల్ప్‌లైన్-1098, పోలీస్ హెల్ప్‌లైన్-100, వుమెన్ హెల్ప్‌లైన్-181 కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వవచ్చు. బాల్యవివాహాల నియంత్రణకు అందరూ సహకరించాలి.

కొండగట్టు అగ్ని ప్రమాద నివేదిక పంపండి

- అధికారులను ఆదేశించిన సీఎం
- ముఖ్యమంత్రిని కలిసి ఆదుకోవాలన్న మంత్రి, ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

మల్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టులో అగ్నిప్రమాదానికి సంబంధించిన నివేదికను వెంటనే పంపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి ప్రమాద ఘటన గురించి వివరించారు. ప్రమాదంలో ముప్పైకి పైగా దుకాణాలు కాలిపోయి అనేక కుటుంబాలు నిరాశ్రయులు అయ్యాయన్నారు. బాధిత కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున పరిహారం అందించాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పరిహారం అందజేతకు నివేదిక కోరిన సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

విమానాశ్రయం స్థల సర్వే కోసం ఏఏఐ బృందం రాక



పెద్దపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో విమానాశ్రయం ఏర్పాటు కోసం ఈ నెల 3, 4 తేదీల్లో ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) బృందం రామగుండం సందర్శించి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తారని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బసంత్‌నగర్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా రామగుండంలో పోర్టు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చామని, ఈ విషయ మై పలుమార్లు కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని కలిసి విజ్ఞప్తి చేశారు. అందుకు సమ్మతించడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రీ- ఫీజిబిలిటీ స్టడీ కోసం 50 లక్షల రూపాయలు కూడా కేంద్రానికి చెల్లించామని పేర్కొన్నారు. సోమవారం మరోసారి కేంద్ర మంత్రిని కలిసి త్వరగా సర్వే చేపట్టాలని కోరగా, ఆయన వెంటనే స్పందించారని తెలిపారు. ఈ నెల 3 లేదా 4వ తేదీన ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా బృందం రామగుండం సందర్శించనున్నదని ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు. ఇక్కడ ఎయిర్ పోర్టు నిర్మాణమైతే పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల, ఆసిఫాబాద్, తదితర జిల్లాల వాసులకు రవాణా సౌకర్యం మరింత మెరుగు పడనున్నదని అన్నారు.

ఆదమరిస్తే.. అనంతలోకాలకే

సెప్టిక్ ట్యాంక్ మ్యాన్ హోల్స్‌తో పొంచి ఉన్న ప్రమాదం

జగిత్యాల టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఇదివరకే ఏర్పాటు చేసిన రోడ్లు ఉన్నప్పటి ఈ మధ్యకాలంలో అధికారులు కొత్త రోడ్డు నిర్మాణం చేశారు. ఈ రోడ్డు ప్రమాదకరంగా మారింది. అధికారులు రోడ్డు నిర్మాణం చేస్తున్న క్రమంలో 60 యేళ్ల కిందట ఎస్సారెస్పీ అధికారుల కోసం క్వార్టర్లు నిర్మించి వాటి కోసం పెద్ద సెప్టిక్ ట్యాంక్‌లు కట్టారు. అధికారులు సెప్టిక్ ట్యాంక్ అడ్డుగా వచ్చిన చోట రోడ్డును కొంత మలుపు తిప్పి నిర్మాణం చేశారు. అక్కడే ప్రైమరీ స్కూల్, హైస్కూల్‌తో పాటు వైద్య విద్యార్థుల వసతి గృహాలు ఉన్నాయి. అధికారులు కొత్త రోడ్డు నిర్మించడంతో ఇటు విద్యార్థులు, నిత్యం వాకింగ్ చేసే వాకర్లు సైతం ఇదే రోడ్డును ఉపయోగిస్తున్నారు.



మ్యాన్‌హోల్స్‌ను చూపిస్తున్న విద్యార్థులు

రోడ్డును ఆనుకొని గడ్డితో కప్పబడి ఏర్పడకుండా ఉన్న సెప్టిక్ ట్యాంక్ మ్యాన్ హోల్స్ పెను ప్రమాదంగా మారాయి. గమనించకుండా ముందుకు సాగితే మ్యాన్ హోల్స్‌లో పడే ప్రమాదం ఉంది. వీధిలైట్లు కూడా లేవని ప్రమాదకర మ్యాన్ హోల్స్‌ను పూర్తిగా మూసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

తిమ్మాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా సంఘటన స్థలంలోనే తీవ్రగాయాలతో మృతి చెందాడు. ఎల్‌ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని రేకుర్తికి చెందిన పొన్నం శ్రీకాంత్ గౌడ్(32) హైదారాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం హైదారాబాద్ నుంచి కరీంనగర్‌లోని ఇంటికి వచ్చినట్లు సమాచారం. సోమవారం రాత్రి తిమ్మాపూర్ వైపు వచ్చిన పొన్నం శ్రీకాంత్‌గౌడ్ కరీంనగర్ వెళ్తున్నాడు. ఈక్రమంలో తిమ్మాపూర్ రాజీవ్ రహదారి పక్కనున్న ఓ మటన్ ట్రెడర్స్ సమీపంలో తన ద్విచక్ర వాహనాన్ని అపి రోడ్డుకు అవతలి వైపునకు వెళ్తున్నాడు. శ్రీకాంత్‌గౌడ్‌ను కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలతో శ్రీకాంత్‌గౌడ్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ మృతదేహాన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతుడు శ్రీకాంత్‌గౌడ్ కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు పొన్నం అనిల్ గౌడ్ సోదరుడు.



శ్రీకాంత్‌గౌడ్(ఫైల్)

ఆ రెండు గ్రామాల్లో ఎన్నికలు లేవు..

సైదాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంచంద్రాపూర్, కురుమపల్లి గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలపై హైకోర్టు స్టే విధించింది. మండలంలోని 27 గ్రామాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు ఉండడంతో ఆయా గ్రామాలు సందడిగా కనిపిస్తున్నాయి. రామచంద్రాపూర్, కరుమపల్లి గ్రామాలు మాత్రం వెలవెలబోతున్నాయి. రాంచంద్రాపూర్, కురుమపల్లి గ్రామాలు కలిసి ఉమ్మడి గ్రామ పంచాయతీగా ఉండేది. కురుమపల్లి గ్రామ ప్రజలు తమ ఊరికి ప్రత్యేక గ్రామ పంచాయతీ కావాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి సర్పంచ్ గ్రామసభలో తీర్మానం చేసి కురుమపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దీంతో ప్రభుత్వం కురుమపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. రాంచంద్రాపూర్‌కు చెందిన కొందరు గ్రామస్థులు కురుమపల్లికి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు తగిన అర్హతలు లేవని, నిబంధనలకు విరుద్ధంగా రెండు గ్రామాలను విడగొట్టారని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు స్టే విధించింది. దీంతో ఈ గ్రామాల్లో ఎన్నికలను అధికారులు నిలిపివేశారు. ఈ రెండు గ్రామాలకు అధికారులు రిజర్వేషన్లు ఖరారు చేశారు. రాంచంద్రాపూర్‌కు జనరల్, కురుమపల్లికి బీసీ జనరల్ కేటాయించారు. ఆశావాహులు ఎన్నికలు జరుగుతాయని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈదశలో హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికలు నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఆశావహులు నిరాశ చెందారు.



రాంచంద్రాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

మల్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినీలు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన హారిక, యశశ్విని, తేజస్విని, నిత్యశ్రీ, చందన జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపిక కాగా విద్యార్థినులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

వేములవాడలో భక్తజన సందోహం



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

వేములవాడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆలయం భక్తజన సందోహంతో నిండుకుంది. సోమవారం భక్తులరద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 50 వేల మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎల్‌ఈడీ స్క్రీన్‌లో రాజరాజేశ్వర స్వామివారిని, భీమేశ్వరాలయంలో స్వామివారిని దర్శించు కుని తరించారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఇందుకు నాలుగు గంటల సమయం పట్టింది. భీమేశ్వరాలయం ఎదురుగా ఉన్న అన్నదాన సత్రం పైఅంతస్తులో కల్యాణం, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. కల్యాణానికి అనూహ్యంగా భక్తుల సంఖ్య పెరగడంతో 117 టికెట్లు జారీ చేశారు. కేవలం దంపతులను మాత్రమే అనుమతించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి పర్యవేక్షిస్తూ తగిన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు స్నానాలకు, తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. తగినన్ని పాయింట్స్ లేకపోవడంతో భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఆలయానికి వచ్చే వాహనాలను భీమేశ్వరాలయం వైపు అనుమతించలేదు. పార్కింగ్, అన్నదానసత్రం వద్ద నోఎంట్రీ బోర్డులు పెట్టారు. దీంతో భక్తుల వాహనాలు ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడ్డారు.

బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. భీమేశ్వరస్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో బద్దిపోచమ్మ ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు తృతీయ స్థానం



ఉమ్మడి జిల్లా బాలుర ఖో-ఖో జట్టు సభ్యులతో అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ ఖో-ఖో పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరులో గత నెల 28, 29, 30 తేదీల్లో 44వ రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖో-ఖో పోటీలు నిర్వహించారు. సెమీఫైనల్‌లో ఆదిలాబాద్ జట్టుతో తలపడి ఓటమి చెంది తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా బాలుర జట్టును జిల్లా ఖోఖో అసోసియేయేషన్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు, జిల్లా ఖో-ఖో సంఘ సభ్యులు ట్రాఫిక్ ఆర్‌ఐ కుమారస్వామి, వి.సూర్య ప్రకాశ్, చిట్టి తిరుపతిరెడ్డి, డాక్టర్ ఎ.రవీందర్, డాక్టర్ వి.నవీన్ కుమార్, ఎస్‌కే మొయుద్దీన్, కట్ట సంతోష్, బి.శేఖర్, ఆర్.తిరుపతిరెడ్డి, యోగేష్, వి.శ్రీలత, పి.జ్యోతి, జి.రేణుక, సంధ్య, ఖో-ఖో కోచ్‌లు నరేష్, వెంకటేష్, ఆనంద్, జలంధర్, కరుణాకర్, అశోక్ అభినందించారు.

పెన్షనర్ల బకాయిల కోసం..
ప్రత్యేక నిధులు విడుదల చేయాలి

- 'రేవా' రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల (పెన్షనర్ల) బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయాలని రిటైర్డు ఉద్యోగుల సంక్షేమ సంఘం (రేవా)రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఫిలింభవన్‌లో ఏర్పాటు చేసిన రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 నెలలుగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ రూపాయలను ప్రభుత్వం ఇవ్వలేదని, పదవీ విరమణ పొందిన వెంటనే ఇవ్వాల్సిన వీటిని ఇప్పటి వరకు ఇవ్వక పోవడంతో పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చాలామంది అనారోగ్యాలకు గురై చనిపోతున్నారని ఆవేద న చెందారు. ఈ విషయమై పెన్షనర్ల సంఘాలు హైదరా బాద్ ఇందిరాపార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేయడంతో స్పందించిన ప్రభుత్వం రూ.707.30 కోట్లు విడుదల చేసిందని అన్నారు. అవి కేవలం పదవిలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు మాత్రమే వారి పెండింగ్ బకాయిల చెల్లింపులకు సరిపోతాయే తప్ప పెన్షనర్లకు బకాయిల చెల్లింపులు జరగవని, ప్రభుత్వ ప్రత్యేక నిధులు పెన్షనర్ల కోసం విడుదల చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల ప్రభాకర్‌రావు మాట్లాడుతూ పెన్షనర్లందరికి ఏక మొత్తంగా బకాయిలను చెల్లించేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు అవసరమైన కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె జగదీశ్వరచారి, కోశాధికారి కనపర్తి దివాకర్, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాంరెడ్డి, సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు వంగ సుధా కర్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పోనమల్లు రాములు, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, కోశాధికారి రాజిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేవా రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు చరితేష్ ప్రాజెక్టు

శంకరపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల పోటీలకు శంకరపట్నం మండలం మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముత్తునూరి చరితేష్ ప్రాజెక్టు ఎంపికైంది. సీనియర్స్ విభాగంలో వాహన ప్రమాదాన్ని నిలువరించే వాస్కోట్ ప్రాజెక్టు ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు బాబు తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో ప్రదర్శించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కంకణాల నీరజ, ఉపాధ్యాయులు అభినందించారు.

● సంక్షిప్తంగా..

ఇల్లందకుంట : ఇల్లందకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 6వ తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న బాలబాలికలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షాట్‌పుట్, రన్‌లో ప్రతిభ కనబరిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం తస్నీన్ నజ్మీన్ పాల్గొన్నారు.

గణేశ్‌నగర్ : బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా మదాసు సంజీవ్‌ను నియమిస్తూ సోమవారం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

చొప్పదండి : కరీంనగర్‌లో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ జూనియర్ విభాగంలో రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థి ఆర్ సామ్రాట్ ద్వితీయ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా డీఈవో మొండయ్య, మెంటర్ టీచర్ మహేష్, పాఠశాల డైరెక్టర్ కర్నల్ రాజాదత్త, ప్రిన్సిపాల్ లింగయ్య, ఎస్‌వీకే శ్రీనివాస్, జేవీపీ ప్రమోద్ రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

కరీంనగర్ క్రైం: కరీంనగర్ హౌస్సింగ్‌బోర్డు పురలో పిల్లల కిడ్నాప్ యత్నం జరిగిందంటూ సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియో సోమవారం వైరల్ అయ్యింది. అందులో ఎలాంటి నిజం లేదని త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. తప్పుడు ప్రచారం చేయొద్దని సూచించారు.

గణేశ్‌నగర్ : జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలను అకాడమిక్ ఆడిట్ సలహాదారు, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి డాక్టర్ వాసాల వరప్రసాద్ సంయుక్తంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాల అంశాలను సూక్ష్మంగా పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ అకాడమిక్ సలహాదారులను సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఐక్యూఏసీ సమన్వయకర్త హర్ జోత్ కౌర్ పాల్గన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



హుజూరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సుభాష్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, నీతి నిబంధనలకు కట్టుబడి ఉండడం వంటి జీవన విలువలతోనే ఎయిడ్స్ వంటి వ్యాధుల నివారణ సాధ్యమన్నారు. ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ ఆకుల శైలజ మాట్లాడుతూ ఎయిడ్స్ సోకిన కుటుంబాలు ఇప్పటికీ సమాజంలో వివక్షను ఎదుర్కొంటున్నాయన్నారు. వారి సమస్యలను సమాజం అర్థం చేసుకోవాలన్నారు. ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మహేష్, వైద్యులు అంజిబాబు, కొల్లూరి రమేష్, శివకుమార్, సునీల్‌రెడ్డి, జ్యోతి, గీతారెడ్డి, రవికాంత్, సాయికృష్ణ, ఆదేపు శైలజ, సివిఎం చైర్మన్ చాట్ల శ్రీధర్, వర్సి, నీలిమ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ : హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారా యణరెడ్డి, మెడికలాఫీసర్ డాక్టర్ తులసీదాస్, డాక్టర్ జరీనా తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: స్థానిక వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

చొప్పదండి : చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎంఏ సభ్యులు, సీవీవీఎం ఫార్మసీ కళాశాల విద్యార్థులు

ఎన్నికల నియమావళిని పాటించాలి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలుగనీయకుండా మసలుకోవాలని కరీంనగర్ రూరల్ పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం రూరల్ మండంలోని నగునూర్, జూబ్లీనగర్‌లో సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యాక్రమాలను నిర్వహించారు. ప్రస్తుత పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సంయమనంతో వ్యవ హరించాలని కోరారు. గ్రామాలలో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఎన్నికల ప్రలోభాలకు లోనవకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

సైదాపూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) సైదాపూర్ మండలం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు 3వ విడతకు ఎంపికైంది. ఇందులో భాగంగా బుధవారం నుంచి ఈ నెల 5 వరకు వరకు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు స్వీరించనున్నారు. ప్రతీ రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. మండలంలో 29 గ్రామాలు ఉండగా రాంచంద్రాపూర్, కురుమపల్లిలో కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలు నిలిపివేశారు. మిగతా 27 గ్రామ పంచాయతీలకు, 238 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ 27 గ్రామాలకు బొమ్మకల్, సోమారం, ఎలబోతారం, గొడిశాల, ఘనపూర్, సైదాపూర్, వెన్కేపల్లిలో ఏడు క్లష్టర్లు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలకు కేటాయించిన క్లస్టర్‌లో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లు స్వీకరిస్తారు. బొమ్మకల్‌లో బొమ్మకల్, అమ్మనగుర్తి, రాయికల్, గుండ్లపల్లి, సోమారంలో గర్రెపల్లి, వెన్నంపల్లి, ఎక్లాస్‌పూర్, సోమారం, ఎలబోతారంలో ఎలబోతారం, జాగీర్‌పల్లి, రాములపల్లి, ఎల్లంపల్లి, గొడిశాలలో గొడిశాల, నల్లరామయ్యపల్లి, గుజ్జులపల్లి, ఘనపూర్‌లో సర్వాయిపేట, పెర్కపల్లి, ఘనపూర్, గొళ్లగూడెం, సైదాపూర్‌లో ఆరెపల్లి, సైదాపూర్, సల్మన్నపల్లి, రాయికల్‌తండా, వెన్కేపల్లిలో వెన్కేపల్లి, దుద్దెనపల్లి, ఆకునూర్, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో యాదగిరి తెలిపారు.


సైదాపూర్ ఎంపీడీవో కార్యాలయం

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

తిమ్మాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం తిమ్మాపూర్ మండల కేంద్రంలో పలువురు బీజేపీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల కేంద్రంగా ఉన్న తిమ్మాపూర్ అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణమన్నారు. గతంలో ఈ ప్రాంతం నుంచి గెలుపొందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు స్వప్రయోజనాల కోసం పనిచేసుకున్నారే తప్ప, గ్రామ అభివృద్ధి కోసం కృషి చేసిన దాఖలాలు లేవని అన్నారు. మండల కేంద్ర ంగా గ్రామ పంచాయతీగా ఉన్న తిమ్మాపూర్ అభి వృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. పంచా యతీ ఎన్నికల్లో బీజేపీ తరఫున నిలిచిన తక్కిటి దేవేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు కళ్యాణ్ చంద్ర, మల్లారెడ్డి, జోగిరెడ్డి, రవి, రాజేందర్ రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

జీటీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రవీందర్, చంద్రశేఖర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) జిల్లా అధ్యక్షుడిగా గాజుల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా మోతె చంద్రశేఖరెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం నగరంలో జరిగిన జీటీఏ సమావేశంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడిగా సర్వీసు రూల్స్ ఏర్పాటు చేయడం అసాధ్యమని, భవిష్యత్‌లో సంఘం పరంగా నిర్వహించే ప్రతి కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు విధిగా సహకరించాలని కోరారు. జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్‌గా నిబంధనలకు విరుద్ధంగా జడ్పీ మేనేజిమెంట్ ఉపాధ్యాయుడికి కట్టబెట్టారని, దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు వాల్సిన హక్కులను సాధించుకుంటామన్నారు. సమావేశంలో జీటీఏ మాజీ అధ్యక్షుడు జాన్ సుధాకర్, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, కోశాధికారి బి.శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి ఓపెన్ జూనియర్ చదరంగ పోటీలు సోమవారం ముగిశాయి. జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ చైతన్య యూత్ క్లబ్ జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు రెండు రోజులపాటు సాగాయి. ఈ పోటీల్లో ఓపెన్ కేటగిరిలో కె.సమర తేజ ప్రథమ, కన్నం విశ్వనాథ్ ద్వితీయ, విశ్వనాథ్ ప్రసాద్ తృతీయ, ధోనే అక్షిత్ నాలుగు, తిరుపతి ఐదో స్థానంలో నిలిచారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు సమావేశంలో జీనియస్ చదరంగ అకాడమీ చైర్మన్ కంకటి కనకయ్య, చైతన్య క్లబ్ నిర్వాహకులు ధోని ఉపేంద్రనాథ్ బహుమతులు అందజేశారు. నిర్వాహకులు బొంతల ప్రవీణ్ కుమార్, వర్ధిని వెంకటరావు, పండుగ నాగరాజు, బత్తిని మధు, నూనె సాయికృష్ణ, చదరంగం అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, కో-ఆర్డినేటర్ సుజన్ కుమార్, చదరంగ కోచ్‌లు అభిరామ్, రేవిక్, అరుణ్ ప్రభు, శ్రీనిజ, స్వాతి పాల్గొన్నారు.

విజయనగర కాలనీవాసుల భూ సమస్య పరిష్కారం

గంగాధర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గర్షకుర్తి విజయ నగర కాలనీ వాసుల భూ సమస్య పరిష్కారమైంది. గ్రామంలోని సర్వే నంబరు 566ఈబిలో కొందరు పందేళ్ల క్రితం ఇళ్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలంలో గ్రామ పంచాయతీ అనుమతులతో ఇళ్లు నిర్మించి విజయనగర కాలనీగా పేరు పెట్టుకున్నారు. ఆ స్థలంలో తమకు హక్కు ఉందని, ఖాళీ చేయాలని బినామీలు కోర్టు నోటీసులు పంపించారు. విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లగా ఆర్డీవోతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు తహసీల్దార్‌కు మోఖాను పరిశీలించి ఆధారాలతో నివేదిక అందించాలని ఆదేశించగా కాలనీవాసులు విచారించి నివేదికను ఆర్డీవోకు పంపించారు. సోమవారం కాలనీవాసులకు చెందినదిగా భూ రికార్డులో నమోదు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పదేళ్ల సమస్యకు పరిష్కారం లభించడంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన క్రైస్తవ మేఘారోహణ పండుగ సభలు

గంగాధర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బైబిల్ మిషన్ మేఘారోహణ పండగ సభలు సోమవారంతో ముగిశాయి. తెలంగాణలో బైబిల్ మిషన్ సంస్థకు కేంద్రమైన కరీంనగర్ జిల్లా లక్ష్మీదేవిపల్లిలో ఏటా సభలు నిర్వహిస్తున్నారు. ఈ సభలకు ముంబాయి, తెలంగాణ వివిధ ప్రాంతాల నుంచి క్రైస్తవులు, పాస్టర్లు వస్తారు. వచ్చిన వారికి కన్వీనర్లు పాస్టర్ ధర్మతేజ, చైతన్య ఏర్పాట్లు చేశారు. క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. రెవరెండ్ ప్రశాంత్, రెవ అశోక్, స్యాలేమ్‌రాజ్, ప్రవీణ్ పాల్గొన్నారు.


కీర్తనలు ఆలపిస్తున్న క్వయర్ బృందం

అయ్యప్పస్వామి ఆలయంలో మహాభిక్ష ప్రారంభం

హుజూరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో మహా భిక్షా కార్యక్రమం సోమవారం ప్రారంభ మైంది. దీక్ష తీసుకున్న స్వాములకు, భక్తులకు నిత్యాన్నదానం చేయనున్నారు. ఆలయ చైర్మన్ కొత్త అశోక్‌రెడ్డి, కమిటీ సభ్యులు పూజలు చేశారు.

సైదాపూర్: సైదాపూర్ మండలంలోని జాగీర్‌పల్లిలో కన్నెస్వామి పేరం హరిహరన్ ఇంటి వద్ద వెంకట్రావు గురుస్వామి, దొరైరాజు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


భిక్షా చేస్తున్న అయ్యప్పస్వాములు

రెండో రోజు భారీగా నామినేషన్లు


పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ వెంకటేశ్వర్లు

● తరలివచ్చిన అభ్యర్థులు

తిమ్మాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడత నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు కొనసాగింది. తిమ్మాపూర్ వ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీల్లో 65 సర్పంచ్, వార్డు సభ్యుల కోసం 271 మంది నామినేషన్లు దాఖలు చేశారు. తిమ్మాపూర్ సర్పంచ్ 2, వార్డు 20, మహాత్మానగర్ సర్పంచ్ 4, వార్డు 11, కొత్తపల్లి సర్పంచ్ 4, వార్డు 8, రేణికుంట సర్పంచ్ 3, వార్డు 30, నల్లగొండ సర్పంచ్ 3, వార్డు 8, బాలయ్యపల్లి సర్పంచ్ 2, వార్డు 1, మక్తపల్లి సర్పంచ్ 3, వార్డు 12, నుస్తులాపూర్ సర్పంచ్ 2, వార్డు 21, రామకృష్ణ కాలనీ సర్పంచ్ 4, వార్డు సభ్యులు 22. ఇందిరానగర్ సర్పంచ్ 4, వార్డు 10, మన్నెంపల్లి సర్పంచ్ 3, వార్డు 9, పోరండ్ల సర్పంచ్2, వార్డు 13, లక్ష్మీదేవిపల్లి సర్పంచ్ 3, వార్డు 6, నేదునూర్ సర్పంచ్ 3, వార్డు 8, గొల్లపల్లి సర్పంచ్ 1, వార్డు 8, వచ్చునూర్ సర్పంచ్ 1, వార్డు 7, రాంహనుమన్ నగర్ సర్పంచ్ 2, వార్డు 4, జుగుండ్ల సర్పంచ్ 3, వార్డు 4, పర్లపల్లి సర్పంచ్ 4, వార్డు 21, మొగిళి పాలెం సర్పంచ్ 4, వార్డు 22, పొలంపల్లి సర్పంచ్ 2, వార్డు 5, నర్సింగాపూర్ సర్పంచ్ 1, వార్డు 5, మల్లాపూర్ సర్పంచ్ 5, వార్డు 18 చొప్పున నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర తెలిపారు.

మానకొండూర్‌లో..

మానకొండూర్: మండలంలో సర్పంచ్ స్థానాలకు 91, వార్డు స్థానాలకు 357 నామినేషన్లు దాఖలయ్యాయి. అన్నారంలో సర్పంచ్ 5, వార్డు 21, రాఘవాపూర్ సర్పంచ్ 1 వార్డు 8, లలితాపూర్ సర్పంచ్ 3 వార్డు 6, చెంజర్లలో సర్పంచ్ 3 వార్డు 38, పెద్దూరుపల్లి సర్పంచ్ 1 వార్డు 3, నిజాయితీగూడెం సర్పంచ్ 1, వార్డు 4, దేవంపల్లి సర్పంచ్ 4 వార్డు 9, కెల్లేడు సర్పంచ్ 3, వార్డు 10, పోచంపల్లి సర్పంచ్ 5, వార్డు 9, గంగిపల్లి సర్పంచ్ 3, వార్డు 17, గట్టుదుద్దెనపల్లి సర్పంచ్ 3, వార్డు 13, వన్నారం సర్పంచ్ 2, వార్డు 8, శంషాబాద్ సర్పంచ్ 2, వార్డు 8, లింగాపూర్ సర్పంచ్ 4, వార్డు 13, శ్రీనివాస్‌నగర్ సర్పంచ్ 5, వార్డు 15, జగ్గయ్యపల్లి సర్పంచ్ 2, వార్డు 3, కొండపల్కల సర్పంచ్ 2, వార్డు 9, బంజేరుపల్లి సర్పంచ్ 2, వార్డు 8, మానకొండూర్ సర్పంచ్ 4, వార్డు 30, ఖాదర్‌గూడెంలో సర్పంచ్ 2, వార్డు 9, ముంజంపల్లి సర్పంచ్ 3, వార్డు 9, ఈదులగట్టెపల్లి సర్పంచ్ 4, వార్డు 12, పచ్చునూర్ సర్పంచ్ 9, వార్డు 28, మద్దికుంట సర్పంచ్ 2, వార్డు 6, ఊటూర్ సర్పంచ్ 3, వార్డు 13, వేగురుపల్లి సర్పంచ్ 4, వార్డు 18, వెల్ది సర్పంచ్ 2, వార్డు 5, రంగపేట సర్పంచ్ 4, వార్డు 17, లక్ష్మీపూర్‌లో సర్పంచ్ 3, వార్డులకు 9 చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు.

చిగురుమామిడిలో..

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు సోమవారం 53 సర్పంచ్ అభ్యర్థులు, 184 మంది వార్డు సభ్యుల పదవులకు 124 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. రెండు రోజుల్లో 69 సర్పంచ్, 216 వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలైనట్లు పేర్కొన్నారు.

గన్నేరువరంలో..

గన్నేరువరం: మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు రెండో రోజు సోమవారం నామినేషన్ ప్రక్రియ జోరుగా సాగింది. అభ్యర్థులు నామినేషన్‌లను వేయడానికి స్థానిక ప్రజలను సమీకరించి ర్యాలీగా తరలివచ్చి నామినేషన్లు వేశారు. సర్పంచ్ స్థానాలకు 49, వార్డు స్థానాలకు 96 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. గన్నేరువరంలో సర్పంచ్‌కు 7, వార్డు 20, గునుకుల కొండాపూర్ సర్పంచ్ 6, వార్డు 6, గుండ్లపల్లి ఎక్స్ రోడ్‌లో సర్పంచ్ 3, వార్డు 5, చీమలకుంటపల్లి సర్పంచ్ 1, వార్డు 2, జంగపల్లి సర్పంచ్ 4, వార్డు 11, మైలారం సర్పంచ్ 3, వార్డు 10, ఖాసింపేట సర్పంచ్ 4, వార్డు 12, మాదాపూర్ సర్పంచ్ 3, వార్డు 8, చొక్కారావుపల్లిలో సర్పంచ్ 2, వార్డు 3, యాస్వాడ సర్పంచ్ 1, వార్డు 2, చాకలివానిపల్లి సర్పంచ్ 3, వార్డు 2, గుండ్లపల్లి సర్పంచ్ 3, వార్డు 7, హన్మాజిపల్లి సర్పంచ్ 2, వార్డు 6, సాంబయపల్లి సర్పంచ్ 3, వార్డు 2, గోపాల్‌పూర్ సర్పంచ్ 2, పారువెల్ల సర్పంచ్‌కు 2 నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై నరేందర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

మానకొండూర్ : మానకొండూర్ మండలంలో కొనసాగుతున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను రెండో రోజు సోమవారం జిల్లా పంచాయతీ ఎన్నికల పరిశీలకుడు వెంకటేశ్వర్లు పరిశీలించారు. మండలంలోని మానకొండూర్, గట్టుదుద్దెనపల్లి గ్రామాలలో కొనసాగుతున్న నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించి నామినేషన్లను సక్రమంగా, త్వరగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా మండలంలోని లింగాపూర్ నామినేషన్ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ సందర్శించారు. ఆటంకాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

శంకరపట్నం : శంకరపట్నం మండలంలోని కేశవపట్నం, తాడికల్, మొలంగూర్ గ్రామాల్లోని పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సోమవారం ఎన్నికల అబ్జర్వర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులకు అసౌకర్యాలు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల జోరు

(5వ పేజీ తరువాయి)

ఉపసంహరణ గడువు మంగళవారం ముగియనుండడంతో నామినేషన్లు వేసిన అభ్యర్థులను నయానో...బయానో పోటీ నుంచి తప్పించేందుకు సర్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని చోట్ల సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీపడుతున్న అభ్యర్థులు వారికి మద్దతుగా ఉపసంహరిం చుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు.కొంత మంది నజరానా చూపిస్తే మరికొన్ని చోట్ల బుజ్జగింపులు, పెద్దలతో ఒప్పించి పోటీ నుంచి తప్పించే ప్రయ త్నాలు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎన్నికల హడావుడి నెలకొంది. దాదాపు ప్రతి గ్రామంలో సర్పంచ్ పదవులకు ముగ్గురు కంటే ఎక్కువగా రంగంలో ఉండడంతో ప్రధాన పోటీదారులు నామినేషన్లు వేసిన కొందరిని వారికి మద్దతుగా ఉపసంహరించుకునే ప్రయత్నాలు చేస్తు న్నారు. మరోవైపు వార్డుసభ్యుల స్థానాల్లో ఇప్పటికే చాలా చోట్ల సింగిల్ నామినేషన్లతో ఏకగ్రీవంగా కాగా, రెండు, మూడు నామినేషన్లు, అంత కంటే ఎక్కువ ఉన్న వారిని కూడా ఒప్పించి పోటీ నుంచి తప్పించేందుకు ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం ఐదు గంటల వరకు ఉపసంహరణ గడువు ఉండడంతో ఆలోగా నామినేషన్లను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

మంచికట్ల రాజేశంకు అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అదనపు బాధ్యతలు



కరీంనగర్ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది మంచికట్ల రాజేశంకు కరీంనగర్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్‌కోర్టు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నియామక ఉత్తర్వులు అందుకున్న రాజేశం బాధ్యతలు తీసుకున్నారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టానికి సంబంధించిన కేసుల విచారణ ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు -2 స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాజేశం ఇప్పటికే విధులు నిర్వహిస్తున్నారు. బాలబాలికలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కేసుల్లో పోలీసుల పక్షాన వాదిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): మరమ్మతు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ టూ ఏడీఈ లావణ్య తెలిపారు. రాంనగర్ ఏరియా, సిద్ధార్థ స్కూల్, సత్యనారాయణ స్వామి టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ట్రినిటిలో లైఫ్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం

కరీంనగర్ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలోని ఎంబీఏ విద్యార్థులకు మేజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైఫ్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ట్రైనర్ తిరుపతి మాట్లాడుతూ మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందని, ఇందులో భాగంగా ఆరు రోజులపాటు లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ట్రైనింగ్, సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, మేజిక్ బస్ ట్రైనర్ తిరుపతి, ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర సింగ్, అకాడమిక్ డైరెక్టర్ రాజగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్, ఏవో డి. రాజశేఖర్ రెడ్డి, ఎంబీఏ హెచడీవో, టీపీవో డాక్టర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

వీణవంక, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ వినియోగదారులు జమ్మికుంట సబ్ డివిజన్ పరిధిలోని ఇల్లంతకుంట సెక్షన్ కార్యాలయంలో కన్స్యూమర్ గ్రీవెన్స్ కోర్టు నిర్వహిస్తున్నట్లు మండల విద్యుత్ అధికారులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, వోల్టేజీ సమస్యలోపాలు ఉన్న మీటర్లు మార్చడం వంటి ఫిర్యాదులు అందించవచ్చని వెల్లడించారు. సీజీఆర్ ఆఫ్ చైర్మన్ వేణుగోపాలచారి, కె .రమేష్, దేవేందర్, రామరావు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

అందుబాటులోకి హెచ్‌టీఎల్ఎస్ విద్యుత్ లైన్

గణేశ్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దుర్షేడ్ 220కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి వావిలాలపల్లి 132కేవీ కరీంనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ వచ్చే హైటెన్షన్ తీగలకు సంబంధించి ఏసీఎస్ఆర్ కండక్టర్‌కు బదులుగా హెచ్‌టీఎల్ఎస్ కండక్టర్ తీగలు భర్తీ చేయనున్నట్లు ఎస్ఈ రమేష్ బాబు తెలిపారు. దీంతో గ్రౌండ్ క్లియరెన్స్ పెరుగుతుందని, ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. హెచ్‌టీఎల్ఎస్ కండక్టర్ వైరు ద్వారా లైన్ సామర్థ్యం రెండున్నర రెట్లు పెరుగుతుందన్నారు. వేసవిలో నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఉపయోగపడతాయన్నారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

మానకొండూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పీఎం శ్రీ మానకొండూర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం వివిధ ప్రదేశాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. కరీంనగర్, కొత్తపల్లిలో నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి సైన్స్ ప్రదర్శనకు వెళ్లారు. అనంతరం కురిక్యాలలోని బొమ్మలమ్మ గుట్టను సందర్శించారు. అనంతరం రామడుగులోని శిల్ప తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగాపూర్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ నివాసంలో పోతిరెడ్డిపేటకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి వొడితల ప్రణవ్ కుండవా కప్పి ఆహ్వానించారు. సర్పంచ్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీలో వలసలు పెరుగుతున్నాయని, అధిక సంఖ్యలో కాంగ్రెస్ మద్దతు దారులను సర్పంచులుగా గెలుచుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

సీసీ కెమెరాలకు రూ. 60 వేలు అందజేత

చొప్పదండి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివేకానంద విగ్రహం కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ముగ్గురు వ్యాపారులు రూ.60 వేలు అందజేశారు. 5 నంబరు ప్లేట్ డిటెక్టింగ్ సీసీ కెమెరాల ఏర్పాటు కోసం స్క్రాప్ షాపు యజమానులు బొడిగె సంపత్, బొడిగె గంగయ్య, శెట్టిపెల్లి శివ నగదును ఎస్సై నరేష్‌రెడ్డి ద్వారా అందజేశారు.

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ద్వితీయ స్థానం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి ఆల్ఫోర్స్ పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో స్థానిక మంకమ్మతోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ధన్గర్‌వాడీ) విద్యార్థి పి.కార్తీక్‌కు ద్వితీయ స్థానంలో నిలిచాడు. విద్యార్థి రూపొందించిన మంకీగన్ సీనియర్ విభాగంలో ఎమర్జింగ్ టెక్నాలజీలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయిని ప్రమోద తెలిపారు.

వైద్యుల అంజన్‌కుమార్‌కు సన్మానం

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్‌ను సోమవారం కరీంనగర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎలగందుల మునీందర్ నివాసంలో సన్మానించారు. అనంతరం పలు కుల సంఘాల నాయకులు సన్మానం చేశారు. స్థానిక మంచిర్యాల చౌరస్తా ద గోల్డెన్ ఏరీనాను వైద్యుల అంజన్ కుమార్ ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకుడు మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య, కంకణాల అనిల్, వీర దేవేందర్, ఇమ్రాన్, కొండ హరీష్, సిరిపురం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

వీణవంక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతోందన్నారు.